# ఉపాధ్యాయుల గౌరవానికి భంగం కలిగించేలా విద్యా కమిషన్ నివేదిక: 'తపస్' ఆగ్రహం



ఇది కద నిజం ,రాజేంద్రనగర్, ఫిబ్రవరి 27: తెలంగాణ విద్యా కమిషన్ ఇటీవల సమర్పించిన నివేదిక విద్యా రంగ పరిరక్షణకు విరుద్ధంగా ఉండటమే కాకుండా, ఉపాధ్యాయుల గౌరవానికి భంగం కలిగించేలా ఉందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థలో కీలకమైన ఉపాధ్యాయులపై ప్రతికూల ముద్ర వేయడం సముచితం కాదని ఆయన పేర్కొన్నారు. విద్యా కమిషన్ నివేదికలో "టీచర్లకు జీతాలు ఎక్కువగా ఉన్నాయి" అనే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించడం అత్యంత ఆక్షేపణీయమని బాలకృష్ణ విమర్శించారు. విద్యా కమిషన్ ప్రధాన ఉద్దేశ్యం పాఠశాలల పరిస్థితులు, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల అభివృద్ధిపై అధ్యయనం చేయడమే కానీ, పరిధిలో లేని జీతభత్యాల అంశాన్ని ప్రతికూలంగా చర్చించడం ఉపాధ్యాయ లోకాన్ని అవమానించడమేనని ఆయన అన్నారు. ఇటువంటి ప్రకటనలు సమాజంలో ఉపాధ్యాయుడి పట్ల తప్పుడు సంకేతాలు పంపుతాయని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' కు సంబంధించి రవాణా భారాని తల్లిదండ్రులే భరించాలని ప్రతిపాదించడం విద్దూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన ప్రభుత్వ విద్యను సామాన్యుడికి దూరం చేసి, పరోక్షంగా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించేలా ఉందని విమర్శించారు. అలాగే ఉపాధ్యాయుల ప్రమోషన్ల విషయంలో కూడా ప్రతికూల ధోరణి కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. నివేదికలో మన దేశానికి మరియు రాష్ట్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్తల ప్రస్తావన లేకుండా, కేవలం విదేశీయులను మేధావులుగా ప్రస్తావించడం దేశ గౌరవానికి అప్రతిష్ట కలిగించేలా ఉందని బాలకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఈ నివేదికలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి పేరును ప్రస్తావించడం మాత్రం సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. విద్యా రంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల గౌరవానికి కట్టుబడి ఉండే ఏ ప్రతిపాదననైనా 'తపస్' స్వాగతిస్తుందని, కానీ ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే అంశాలపై సంఘం పక్షాన గట్టిగా స్పందిస్తామని ఆయన స్పష్టం చేశారు. నివేదికలోని అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి, త్వరలోనే ప్రభుత్వానికి తపస్ తరపున తగిన సూచనలు, సలహాలు అందజేస్తామని వెల్లడించారు.

## జగద్గిరిగుట్టలో ఆలయ భూముల కబ్జాపై కేసు నమోదు

### : రెవెన్యూ అధికారుల చర్యపై హర్షం

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 27: జగద్గిరిగుట్ట పరిధిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూములను అక్రమంగా కబ్జా చేసి విక్రయిస్తున్న వారిపై జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యు. అశోక్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ఆలయానికి సంబంధించిన భూములను అక్రమంగా ఆక్రమించుకోవడమే కాకుండా, వాటిని ఇతరులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై నరేందర్ రెడ్డి (ఏ1) మరియు ఇతరులపై Crime No. 273/2026 కింద కేసు నమోదు చేశారు. కొత్త చట్టం ప్రకారం ఖ/ం 329(3), 324(4) r/w 3(5) BNS (పాత సెక్షన్లు 447, 427 IPC) కింద ఈ ఎఫ్.ఐ.ఆర్ నమోదైంది. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పేరును అడ్డం పెట్టుకొని గుట్టపై ఉన్న విలువైన స్థలాలను అమ్ముకుంటున్న పాలక మండలి సభ్యులపై, అలాగే వాటిని కొనుగోలు చేసిన శాఖ సమాజ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవడాన్ని ఆకుల సతీష్ టీం స్వాగతించింది. దైవ కార్యాల పేరిట భూ దందాలకు పాల్పడే వారిని ఉపేక్షించకూడదని వారు పేర్కొన్నారు. ఆలయ భూముల పరిరక్షణ కోసం చొరవ చూపి, కబ్జాదారులపై ఫిర్యాదు చేసిన కుత్బుల్లాపూర్ తహశీల్దార్ (ఎమ్మార్వో ) కి మరియు రెవెన్యూ యంత్రాంగానికి ఆకుల సతీష్ టీం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ భూములను, ఆలయ ఆస్తులను కాపాడటంలో అధికారుల పనితీరు అభినందనీయమని వారు కొనియాడారు.

## డిగ్రీ లెక్చరర్ నిరుద్యోగులకు మద్దతు ఇవ్వాలని NSUI తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ కి వినతిపత్రాన్ని అందజేసిన అస్మా....



ఇది కద నిజం : కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల వహిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమే ఈ జి.ఓ నెంబర్ 4..దేశంలో ఎక్కడా లేని ఈ జి.ఓ ఒక్క తెలంగాణ లోనే అమలు చెయ్యాలని చూస్తున్న కొంతమంది కాంగ్రెస్ పెద్దల స్వార్థం... ప్రొఫెసర్ పోస్టులకు ఉండాల్సిన అర్హతలని డిగ్రీ లెక్చరర్ పరీక్షకు పెట్టి ఎంతోమంది నిరుపేద నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటి ఇప్పటికైనా కనువిప్పు కలిగించుకుని.. జి.ఓ నెంబర్ 4 ని రద్దు చేసి పాత పద్ధతిలోనే డిగ్రీ అధ్యాపక పరీక్షను నిర్వహించాలని ,మెరిట్ ఆధారంగానే పోస్టులను భర్తీ చెయ్యాలని ఇందుకు గాను నిరుద్యోగులకు పార్టీలకు అతీతంగా నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిరుద్యోగులకు మద్దతుగా నిలవాలని NSUI తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకట స్వామిని కలిసి వినతిపత్రాన్ని అందజేసిన డిగ్రీ లెక్చరర్ అభ్యర్థులు అస్మా, వికాస్ తదితరులు....

## గిరిజన గ్రామాలపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తాం

### - ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య




ఇది కద నిజం, కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురయ్యే గిరిజన గ్రామాలను గాలికి వదిలేయకుండా.. అధికారులు, పాలకులు వాటిపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమం చేపడతామని ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య హెచ్చరించారు. కుక్కునూరు మండలంలోని గుండుగూడెంలో శుక్రవారం పూనం వెంకట్ అధ్యక్షతన మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఇందులో మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు ముంపు సాకుతో గిరిజన గ్రామాల ప్రజల సమస్యలను ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామాల అభివృద్ధి జరగకుండా అడ్డుకట్ట వేయడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కనీస వసతులను కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, అందుకే వేసవి రాకముందే గ్రామాల్లో తాగునీరు సమస్య నెలకొందని, సమీప చెరువులు, బావులు, వాగుల్లో ఏర్పాటు చేసిన చెలిమల ద్వారా వచ్చే నీళ్లతోనే గిరిజనులు అవసరాలు తీర్చుకుంటున్నారని మన్నవ తెలిపారు. సరైన మంచినీటి సౌకర్యాలు లేకపోవడంతో గిరిజనులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. గిరిజనులకు రహదారులు, విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలకు ఏ మాత్రం పట్టింపు లేదని సీపీఐ కార్యదర్శి విమర్శించారు. ప్రధానంగా గుండుగూడెంలో తాగునీటి సరఫరా చేసే ట్యాంకులకు విద్యుత్ సరఫరా లైన్లు లేకపోవడంతో అక్కడి గిరిజనులు పడుతున్న బాధలు వర్ణనాతీతం అని చెప్పుకొచ్చారు. తమ సమస్యపై ఐటీడీఏ అధికారుల ఎదుట గిరిజనులు పలుమార్లు మొర పెట్టుకున్నా ఏ మాత్రం ఫలితం లేదని మన్నవ తేల్చి చెప్పారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోని యెడల సీపీఐ అధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని కృష్ణచైతన్య ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో పోలవరం నియోజకవర్గ ఇంచార్జి కారం దారయ్య, కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, సహాయ కార్యదర్శి కూరకుల బాబూరావు, వరసా పాపారావు, సోడే నాగేష్, సోడం దేవయ్య, మడకం నవీన్, సోడే రమేష్, కూరెం లక్ష్మయ్య, సోడే రాంబాబు, ఎర్రయ్య, కంటిపల్లి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## నవాంద్గిలో.. హుబ్లీ సైరన్..!

### నెరవేరిన బషీరాబాద్ వాసుల కల



వికారాబాద్/ తాండూర్, 27 ఫిబ్రవరి (ఇది కద నిజం) : తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండల పరిధిలోని నవాంద్గిలో హుబ్లీ ట్రైన్ సైరన్ కూత సంతోషాన్ని పంచింది. ఎన్నో ఏళ్లుగా హల్టింగ్ కోసం చేసిన పోరాటం ఫలించింది. బషీరాబాద్ మండల ప్రజలకు ఇచ్చిన హామిని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి నెరవేర్చుకున్నారు. శుక్రవారం బషీరాబాద్ మండలం నవాంద్గి రైల్వే స్టేషన్ లో హుబ్లీ ట్రైన్ నిలుపుదల సేవలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలు హాజరయ్యారు. సరిగ్గా సమయానికి హుబ్లీ ట్రైన్ స్టేషన్‌కు చేరుకుంది. అందమైన పువ్వులతో ట్రైన్‌ను అలంకరించారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి ట్రైన్ పైలెట్, ప్రతినిధులను సన్మానించారు. అనంతరం జెండా ఊపి రైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆ వెంటనే అదే ట్రైన్‌లో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, స్థానిక నేతలు ప్రయాణించారు. నావంద్గి నుంచి తాండూరు వరకు ప్రయాణించారు. అక్కడ మీడియాతో మాట్లాడారు. ఎంపీ మాట్లాడుతూ రెండున్నరేళ్లనుంచి నవాంద్గిలో హుబ్లీ ట్రైన్‌ను నిలపాలని ప్రయత్నాలు చేయడం జరిగిందన్నారు. ప్రధాన మంత్రి, రైల్వే మంత్రులు, జీఎం, ఏజీఎంలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాపై నవాంద్గి ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ హుబ్లీ ట్రైన్ నిలుపుదల విషయంలో తాము కూడా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని గుర్తుచేశారు. నవాంద్గిలో హుబ్లీ ట్రైన్ నిలుపుల చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సౌకర్యంతో ఇక్కడి ప్రజలకు, ప్రయాణికులకు ఎంతో మేలు జరగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలేశ్వర్ గుప్త, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్ కుమార్, నవాంద్గి సర్పంచ్ వెంకటేష్ మహరాజ్, మార్కెట్ కమిటి చైర్మన్ మాధవరెడ్డి, ఆత్మ కమిటి చైర్మన్ శంకర్ రెడ్డి, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ రాకేష్ మహరాజ్, సొసైటీ మాజీ చైర్మన్ వెంకట్ రాంరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ రాములు నాయక్, బాల్ రెడ్డి, స్థానికులు తదితరులు ఉన్నారు.

## విలీన మండలాల్లో ఆరోగ్య సేవలు మెరుగుపరచండి

### - పోలవరం ఎమ్మెల్యేకు జనసేన ఉపాధ్యక్షుడు వినతి
### - సానుకూలంగా స్పందించిన చిర్రి బాలరాజు



ఇది కద నిజం, కుక్కునూరు: విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడులో ఆరోగ్య సేవలు మెరుగుపరచాలని కుక్కునూరు మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మంత్రి గోపాలకృష్ణ పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతి పత్రం అందించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంతో ఎమ్మెల్యేతో పలు అంశాలపై చర్చించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో కనీస వైద్య పరీక్షలు లేవని, అలానే తగినంత మంది వైద్యులు కానీ, ఇతర సిబ్బంది కానీ లేరు అని తెలిపినట్లు చెప్పారు. అంతేకాకుండా ఈ రెండు మండలాల్లోని ప్రజలకు ఏదైనా అత్యవసర అనారోగ్య పరిస్థితి ఏర్పడితే 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాచలం కానీ, 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న జంగారెడ్డిగూడెం కానీ తరలించాల్సి వస్తున్నట్లు వివరించానని ఆయన అన్నారు. రెండు మండలాల ప్రజల ఆరోగ్య సమస్యను దృష్టిలో ఉంచుకుని కుక్కునూరు మండల కేంద్రంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు మంత్రి గోపాలకృష్ణ తెలిపారు. ఇక, తమ వినతులు విన్న వెంటనే ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పందించారని, త్వరలోనే ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌తో మాట్లాడి కుక్కునూరులో కమ్యూనిటీ సెంటర్ ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు జనసేన ఉపాధ్యక్షుడు వెల్లడించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు చల్లా కోటేశ్వరరావు, వార్డు మెంబర్ గాడిద వెంకటేశ్వర్లు, ఎస్టీ సెల్ తురసం నరసింహారావు ఉన్నారు.

